## క్లుప్తంగా

### స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా ఏకాంబరం



కార్వేటినగరం: మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా టీటీ కండ్రిగ గ్రామానికి చెందిన ఏకాంబరం శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా ఏకాంబరంను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పథకం కింద గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల విధులను పర్యవేక్షించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేస్తానని చెప్పారు.

### అన్నదానం



అన్నదానం చేస్తున్న టీటీడీ అధికారులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరుకు చెందిన దీపక్‌కుమార్ శనివారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకురావాలన్నారు.

### సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నాం



సర్టిఫికెట్లు అందుకున్న వారితో చైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి

నగరి: పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం సౌత్ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ 11 సర్వీసులకు సంబంధించి 195 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 228 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రం ఒకరికి, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఒకరికి అంటూ 390 మందికి సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, వీకే శ్రీనివాసన్, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, నాయకులు బాబు, అమర్, మున్సిపల్ డీఈ నరేష్, మెప్మా అధికారి సునీత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

పుత్తూరు రూరల్: స్థానిక గేటుపుత్తూరులోని క్యాబిన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు.. శనివారం ఉదయం 10 గంటల సమయంలో గంజాయి విక్రయిస్తున్న తిరుపతి జిల్లా నాగలాపురం పట్టణానికి చెందిన ఏ.విజయభాస్కర్(24), పుత్తూరు పట్టణం ఆనంబట్టు రోడ్డులో నివసిస్తున్న జి.సాయికుమార్(23), పుత్తూరు షాపు వీధికి చెందిన ఎస్.విజయ్ అలియాస్ వెట్టి(41)ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.24 వేలు ఉంటుందని వెల్లడించారు.

### కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక నేతలు

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పడుతోందని, సదరు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కార్మికసంఘ నాయకులు శనివారం తిరుపతిలోని డిస్ట్రిక్ట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (డీసీఎల్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా మిల్లును మూసివేశారని ఆరోపించారు. ఈ విషయమై డీసీఎల్ వద్ద విచారణ జరుగుతుండగా మిల్లులోని యంత్రాలను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. కనీసం మూసివేత పరిహారాన్ని సైతం చెల్లించకుండా కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. మిల్లు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీసీఎల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఏలుమలైరెడ్డి, బాబు, రామ్మూర్తి, నాగూర్, శివలింగం, రాజేంద్రన్, మురగారెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ సారథులు.. వలంటీర్లు

### కరోనా సమయంలో అండగా నిలిచింది




ధర్మయ్యకు కోవిడ్ సమయంలో సేవలందిస్తున్న నవీనాగాంధీ (ఫైల్)

ఈమె పేరు నవీనా గాంధీ. నగరి మండలం తడుకుపేట గ్రామంలో వలంటీర్‌గా సేవలందిస్తోంది. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల దరిచేర్చింది. ఏనాడు గానీ తనకు కేటాయించిన ఇళ్లలోని మహిళల పట్ల అసభ్య ప్రవర్తన చేయలేదు. తెల్లవారకముందే ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తోంది. కుటుంబంలో ఒక వ్యక్తిగా తనకు కేటాయించిన ఇళ్లలోని వారికి చెందిన సమస్యలు పరిష్కరిస్తోంది. గతంలో కరోనా మహమ్మారి సమయంలో వారికి అండగా నిలిచింది. కరోనా సోకిన వారిని క్వారంటైన్‌కు పంపి పలువురిని కాపాడడంలో తనవంతు సాయం అందించింది. అందరూ భయపడినా ఈమె మాత్రం ధైర్యంగా ముందుకువచ్చి సేవలు అందించింది.

**క్వారంటైన్‌కు చేర్చి..**



రెండేళ్ల క్రితం కరోనా వచ్చిన సమయంలో నేను దానిబారిన పడి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాను. ఆ సమయంలో నన్ను క్వారంటైన్‌కు చేర్చడంలో వలంటీర్ చేసిన సాయం మరువలేను. నేను ఆస్పత్రిలో చికిత్స పొంది తిరిగి వచ్చిన సమయంలో ఇంటి వచ్చి తరచూ నా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. మా కుటుంబంలో వ్యక్తిలా నాకు సాయపడింది. అలాంటి వలంటీర్ల గురించి పవన్‌కల్యాణ్ నోటికొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదు.

– ధర్మయ్య, తడుకుపేట దళితవాడ

### సొంత బిడ్డలా సాయం అందించాడు



చెన్నైలో సుబ్బమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

ఇతని పేరు చిన్నరాజ, విజయపురం మండలం, ఆలపాకం వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. తనకు కేటాయించిన 50 ఇళ్లకు ఏ అవసరాలు ఉన్నా వారిలో ఒకరిలా వారికి సాయపడుతున్నాడు. అతనికి కేటాయించిన ఇళ్లల్లో ఎవరి వద్ద దురుసుగా ప్రవర్తించలేదు. వేకువజామునే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నాడు. కోవిడ్ పాండమిక్ పీరియడ్‌లో కోవిడ్ బారిన పడిన పలువురిని క్వారంటైన్‌కు తరలించి వారి ప్రాణాలు కాపాడడంలో పాటు దూరప్రాంతాల్లో ఉన్నవారికి సైతం వెళ్లి పెన్షన్ అందిస్తూ సాయపడ్డాడు.

**120 కిలోమీటర్లు వచ్చి..**



నేడు బంధువుల ఇంటికి చెన్నైకి వెళ్లిన సమయంలో కోవిడ్ లాక్‌డౌన్ విధించారు. దీంతో నేను అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మూడు నెలల పాటు ఇంటికి రాలేక చాలా ఇబ్బంది పడ్డా. చెన్నైలో ఉండడంతో పింఛన్ కూడా తీసుకోలేని పరిస్థితి. అయితే మా వలంటీర్ చిన్నరాజ, నేను ఉన్న అడ్రస్ కనుక్కొని 120 కిలోమీటర్లు దూరం ద్విచక్ర వాహనంలో వచ్చి నాకు పింఛన్ అందించింది. ఆరోజు నేను పొందిన ఆనందం మాటల్లో చెప్పలేనిది. నాకు వలంటీర్ దేవుడిలా అనిపించాడు. ఇలాంటి సహకారం అందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ నోరు పారేసుకోవడం మంచిదికాదు.

– సుబ్బమ్మ, ఆలపాకం గ్రామం, విజయపురం మండలం

- కరోనా వేళ వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సాయం అందించారు
- సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడమే వారి కర్తవ్యం
- ఇతరత్రా వాటితో వారికి సంబంధం లేదు
- ఈ విషయం తెలిసినా కూడా పవన్‌కల్యాణ్ అర్థరహితంగా ఆరోపణలు
- పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న ప్రజలు

నగరి: ఫించన్ కోసం ఆఫీసుల ముందు కట్టిన క్యూలు, ప్రభుత్వ పథకాల కోసం గంటల పడిగాపులు కాసిన రోజులు ఎవరూ మర్చిపోలేదు. కానీ ఈ రోజు ఎవరూ పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో పడిగాపులు కాయడం లేదు. పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగడం ఆగిపోయింది. పౌరసేవల కోసం యాతన పడే దుస్థితి లేదు. ఇందుకు కారణం వలంటీర్ వ్యవస్థ. అలాంటి వ్యవస్థపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తున్న విషయం విదితమే. ఇతర రాష్ట్రాల వారు వచ్చి వలంటీర్ వ్యవస్థ గురించి అధ్యయనం చేస్తుంటే, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాత్రం విషయం కక్కుతున్నారు. నిన్న మొన్నటి వరకు అన్నా, తమ్ముడు అని పిలిచిన వారే నేడు ఆ ప్రాంతాల్లో వలంటీర్లుగా సేవలు అందిస్తుంటే వారిని పట్టుకుని ఆడపిల్లల సమాచారం సేకరిస్తున్నారని అభాండాలు మోపుతున్నారు. అక్కా, చెల్లి అని పలకరించుకున్న తమ వార్డులోని వారే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు అందిస్తుంటే మానవ అక్రమ రవాణాకు సాయం చేస్తున్నారని మతిలేని వ్యాఖ్యలు చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు, సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వలంటీర్లు సకాలంలో అందజేస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఒక రక్షణ కవచంలా ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు. వలంటీర్లను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. నిస్వార్థ సేవకులపై నిందలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థుల సంఖ్యను పెంచండి



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. శనివారం ఎమ్మార్సీలో మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల, మండలం నుంచి ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, నాడు–నేడు పథకంలో విద్యార్థులకు మౌలిక వసతులు, జగనన్న విద్యాకానుకలో ఒక్కో విద్యార్థికి రూ.2500 చొప్పున విద్యాసామగ్రి అందిస్తోందన్నారు. అవికాకుండా పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో రోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. అందువల్ల ప్రైవేటు స్కూళ్లలో తమ పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడి, అవగాహన కల్పించి విద్యార్థుల శాతం పెంచాలన్నారు. అనంతరం మండల నుంచి బదిలీపై పలు మండలాలకు వెళ్లిన 25 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కండ్రిగ హెచ్ఎం మనోహర్ నాయుడు, వెంకటేష్, చంద్రశేఖర్, సీఆర్పీలు మునిరాజ్, శరవణన్, రాజేశ్వరి, మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణకే బియ్యం విక్రయ కేంద్రం



తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందిస్తున్న ఆర్డీఓ సుజన

నగరి: ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్కువ ధరకు బియ్యం విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఆర్డీఓ సుజన అన్నారు. శనివారం పౌరసఫరాల శాఖ ఆదేశాల మేరకు నగరి భవాని హైటెక్ రైస్ మిల్ వారు ఏర్పాటుచేసిన బియ్యం కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. బియ్యం కొనుగోలుకు విచ్చేసిన వారికి బియ్యం బస్తాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బియ్యం విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకే బియ్యం విక్రయిస్తారన్నారు. మార్కెట్‌లో రూ.52 పలికే నాణ్యమైన బియ్యం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రంలో రూ.44.50కే లభిస్తుందన్నారు. త్వరలో పప్పు దినుసులను కూడా విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకు అందిస్తామన్నారు. ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రంలో కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. బియ్యం నాణ్యత, కొలతలను తరచూ పరిశీలిస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ చైతన్యంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న రామ్‌భూపాల్

పుత్తూరు రూరల్: ప్రజల్లో రాజకీయ చైతన్యం వస్తేనే దేశాభివృద్ధి జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామ్‌భూపాల్ అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సీపీఎం జిల్లా నాయకత్వ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచి పెడుతోందని ఆరోపించారు. వీటిని అడ్డుకోవాలంటే సీపీఎంతోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు మురళి, పుల్లయ్య, జనార్ధన్, సుబ్రమణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వడమాలపేట లబ్ధిదారులతో రామ్‌ప్రసాద్‌రెడ్డి



పాలసముద్రం: ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న లబ్ధిదారులతో అధికారులు, నాయకులు

- వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎం జగనన్నను, మంత్రి రోజాను గెలిపించండి
- మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్/నిండ్ర: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టే ప్రతి పథకాన్ని ఒక ఉద్యమంలా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పుత్తూరు మండలం వేపగుంట సచివాలయ పరిధి, మండల కేంద్రమైన వడమాలపేట సచివాలయ పరిధిలో, నిండ్ర మండలంలోని కావనూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం అడుగుజాడల్లో నడుస్తూ మీకోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న మంత్రి ఆర్‌కే రోజాను నగరి నుంచి గెలిపించాలని కోరారు. అనంతరం సురక్ష లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఎంపీపీ మునివేలు, సర్పంచులు గిరిజాప్రసాద్, మురళీయాదవ్, వడమాలపేట తహసీల్దార్ సుబ్రమణ్యం, సర్పంచ్ మునెమ్మ, నిండ్ర ఎంపీపీ దీప, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, నాయకులు శ్యామ్‌లాల్, అనిల్, మండల ప్రత్యేక అధికారి సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు విజేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష**

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు శ్రీరామ రక్ష అని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శనివారం ఆముదాల గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖిత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ప్రత్యేక అధికారి మహబూబ్‌బాషా 603 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, ఏఓ డిల్లీప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



విశేష అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. శనిత్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం



గొల్లకండ్రిగలో గృహనిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ పద్మనాభం

పాలసముద్రం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ పీడీ పద్మనాభం తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఆముదాల, గొల్లకండ్రిగ గ్రామాల్లోని జగనన్న లేవుట్‌లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లేవుట్‌లలో లబ్ధిదారులు గృహనిర్మాణాలను త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తోందన్నారు. జగనన్న లేఅవుట్‌లలో తాగునీరు, విద్యుత్, రోడ్లు ఏర్పాటులో ఏఈ, ఇంజినీర్ అసిస్టెంట్లు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ దాము, మండల విస్తరణ అధికారి రమేష్, సూపర్‌వైజర్ బాబు, గృహనిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

### నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

పుత్తూరు రూరల్: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరి కనమిట్ట వద్ద మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి, పుత్తూరుకు చెందిన పలువురు డాక్టర్లు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు.

### కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీరంగరాజపురం: మండలంలోని అంకనపల్లి ధర్మరాజుల గుడి ఆవరణలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీనివాసుడి కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఈ కార్యక్రమానికి బోయపాటి ధరణి దేవరాజులునాయుడు, గంధమనేని శోభమంజునాథనాయుడు, బోయపాటి పుష్పలత, అశోక్‌నాయుడు తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు.

### ఫార్మా, బయోటెక్ రంగాలపై దృష్టి సారించండి




మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ నరసింహులు

నగరి: భవిష్యత్‌లో బయోటెక్, ఫార్మా రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, విద్యార్థులు ఈ రంగాలపై దృష్టి సారించాలని అమెరికాలోని మియామీ ఎఫ్ఎల్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నరసింహులు కుప్పాల సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం భౌతిక శాస్త్ర విభాగం వారు 'ఫార్మా–బయోటెక్ పరిశ్రమలు, ప్రయోగశాల పద్ధతులు' అనే అంశంపై ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా, బయోటెక్ పరిశ్రమల్లో నాణ్యత ప్రమాణ పరీక్ష, విశ్లేషణ పద్ధతులను వివరించారు. ప్రయోగశాలలు విశాలంగా ఉండాలని, పర్యావరణ అనుకూల విధానాలను అనుసరించాలని సూచించారు. భవిష్యత్‌లో బయోటెక్, ఫార్మా రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, విద్యార్థులు ఈ రంగాలపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో జ్ఞానార్జనతో పాటు ప్రయోగశాలలో అనుభవాత్మక విద్యను పొందడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగం ఇన్‌చార్జ్ డా.ఇందిరా ప్రియదర్శిని, డా.నరసయ్య, మునికుమారి, శివ లక్ష్మి, లాల్‌బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను శనివారం తిరుపతికి చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రెండు దుకాణాల్లోని స్టాకు రిజిష్టర్లను, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్టాకు రిజిస్టర్ సక్రమంగా నిర్వహించని షాపు యజమానులకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో తమ పరిశీలనకు వచ్చిన విషయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

### పుత్తూరు అభివృద్ధికి కృషి చేయండి



రామ్‌ప్రసాద్‌రెడ్డి, హరిని సన్మానిస్తున్న నాయకులు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పార్టీ నాయకులను కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ ఏ.హరి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌ప్రసాద్‌రెడ్డి, హరిని పార్టీ కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా నేతృత్వంలో పుత్తూరు పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనకు అన్నివిధాలా సహకరిస్తున్న మంత్రి సోదరులకు, వైస్ చైర్మన్లకు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.